నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
3 | మహబూబ్‌నగర్, శనివారం 8 మార్చి 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ రజతోత్సవ వేడుకల నేపథ్యంలో ఏప్రిల్ 27న బహిరంగసభను నిర్వహించనున్నారు. ఇందుకుగానూ శుక్రవారం ఎర్రవల్లిలో గులాబీ బాస్ కేసీఆర్ అధ్యక్షతన పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ధన్వాడ మండలం పాతపల్లిలో ఎండిన ఉల్లి పంటను చూపుతున్న రైతు వెంకటయ్య

అడుగంటుతున్న భూగర్భ జలాలు

- వేధిస్తున్న కరెంట్ కోతలు
- ఎండుతున్న పంటలు, కన్నీరు పెడుతున్న రైతన్నలు

ధన్వాడ, మార్చి 7 : రోజురోజుకు ఎండలు ముదురుతుండడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. దీనికి తోడు కరెంట్ కోతలు సైతం వేధిస్తుండడంతో పంటలకు సాగునీరు అందక రైతులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని పాతపల్లి, మందిపల్లి గ్రామాల్లో వందలాది ఎకరాల్లో వరి పంటలు సాగు చేయగా ప్రస్తుతం బోరులో నీరు ఇంకిపోవడమే కాకుండా కరెంట్ కోతలతో పారిన మడే పారడంతో సగానికి సగం పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. పాతపల్లి గ్రామంలో రైతు వెంకయ్య రెండు ఎకరాల్లో అర ఎకరంలో ఉల్లి, మిగతా ఎకరన్నరలో వేరుశనగ పంటను సాగు చేశాడు. అయితే బోరులో నీటిమట్టం తగ్గడంతో వేరుశనగ పంట పూర్తిగా ఎండిపోయింది. అదేవిధంగా అర ఎకరంలో వేసిన వరికి కూడా నీరు అందక ఎండిపోవడంతో చేసేది లేక గొర్రెలు మేతకు వదిలిపెట్టాడు. ఇదే పరిస్థితి గ్రామంలో చాలా మంది రైతులు ఎదుర్కొంటున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి..

నాకున్న రెండు ఎకరాల్లో ఉల్లి, వేరుశనగ పంటను సాగు చేశాను. కానీ బోరు ఎండిపోవడంతోపాటు కరెంట్ కోత వల్ల పంటలు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో పెట్టుబడికి తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం ఎండిపోయిన పంటలను అధికారులు పరిశీలించి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– వెంకటయ్య, రైతు, పాతపల్లి

రైతుల బాధలు ప్రభుత్వానికి పట్టవా..?

- బీఆర్ఎస్ గద్వాల ఇన్‌చార్జి బాసు హనుమంతునాయుడు
- కేటీదొడ్డి మండలంలో ఎండిన పంటల పరిశీలన

గద్వాల/గట్టు, మార్చి 7: రైతుల బాధలు, వారి బాధ్యత ఈ ప్రభుత్వానికి పట్టదా అని గద్వాల నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం గద్వాల నియోజకవర్గ పరిధిలో నెట్టెంపాడు లిఫ్ట్ కింద 104 ప్యాకేజీ పరిధిలోని కొండాపురం, గువ్వలదిన్నె, వెంకటాపురం, ఈర్లబండ, గంగన్‌పల్లి, ఇర్కిచేడ్ గ్రామాల పరిధిలో ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి సాగునీరు అందక ఎండి పోతున్న పంటలను ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ పంటలకు నీరు అందుతాయనే ఆశతో రైతులు పంటలు సాగు చేశారని, ప్రస్తుతం పంటలు చేతికి వచ్చే దశలో చివరి ఆయకట్టు వరకు నీరు రాక ఎండి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పంటలను కాపాడాలని అధికారులకు రైతులు వినతిపత్రం ఇచ్చినా ఎందుకు రైతుల పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు. రెండు రోజుల్లో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించి రైతుల పంటలు కాపాడాలని లేనిచో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 450 మంది రైతులను పొట్టన పెట్టుకున్నదని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా అధికార బాధ్యతలు తీసుకున్న తర్వాత నీళ్లేమో పాతాలని పోయాయని, నిధులేమో ఢిల్లీకి పోతున్నాయని ఆరోపించారు. రేవంత్ సర్కారు పరిపాలన చేతకాక, ఇచ్చిన హామీలను అమలు చేయలేక ఆయనలో అసహనం పెరిగి పోతుందన్నారు. అందుకే ఇష్టం వచ్చినట్లు బీఆర్ఎస్ నేతలను మాట్లాడుతున్నాడని విమర్శించారు. పంటలు పరిశీలించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు మోనేశ్, నూర్‌పాషా, శేఖర్‌నాయుడు, వెంకటేశ్, బీచుపల్లి, రాము, రాజు, గోపాల్, భాస్కర్, తిరుమలేశ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం శివారులో పంట పొలాలను పరిశీలిస్తున్న బాసు హనుమంతు నాయుడు

భర్తను చంపిన భార్య

- కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకటేశ్వర్లు

వనపర్తి టౌన్, మార్చి 7 : అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భార్య భర్తను చంపిన కేసును పోలీసులు చేధించారు. శుక్రవారం సీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు కేసు వివరాలను వెల్లడించారు. పాన్‌గల్ గ్రామానికి చెందిన ఎండీ పర్వీన్‌బేగానికి 12 యేండ్ల కిందట కర్నూల్‌కు చెందిన ఎండీ రెహ్మాతుల్లా (44)తో వివాహమైంది. వారికి ఒక అబ్బాయి, ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. పెళ్లైన రెండేండ్లు కర్నూలు పట్టణంలో కాపురం చేసి వారిద్దరి మధ్య గొడవలు రావడంతో పదేండ్ల కిందటే భార్యాభర్తలు ఇద్దరు పిల్లలతో కలిసి పర్వీన్‌బేగం తమ తల్లిగారి గ్రామమైన పాన్‌గల్ సంతబజారులో అద్దెఇంట్లో జీవనం కొనసాగిస్తున్నారు. తన భర్త పెయింటింగ్, మటన్ కటింగ్ చేస్తూ సంతబజారులో నివాసం ఉంటున్నారు. పర్వీన్‌బేగం టైలరింగ్ నేర్చుకుంటుండగా కిరాణం షాపు నడుపుతున్న కుమ్మరి రాఘవేంద్రతో పరిచయమై అక్రమ సంబంధానికి దారితీసింది. రాఘవేంద్రను తరుచుగా ఇంటికి పిలిచేది. ఒక దశలో వారిద్దరిని భర్త రెహ్మాతుల్లా చూసి పట్టుకొని దాడిచేసి పెద్దల సమక్షంలో రాజీ కుదుర్చుకున్నారు. అక్రమ సంబంధాన్ని మనసులో పెట్టుకున్న రెహ్మాతుల్లా తరుచుగా భార్య పర్విన్ బేగంతో గొడవలు పెట్టుకునేవాడని, ఇతను బతికి ఉన్నన్నాళ్లు తనకు ఇబ్బందులు తప్పవని భావించి రెహ్మాతుల్లాను అంతమొందించేందుకు పర్విన్‌బేగం నిర్ణయించుకుందని చెప్పారు. రాఘవేందర్‌కు పరిచయం ఉన్న కురుమూర్తితో విషయాలు వెల్లడించి రాఘవేంద్రకు ఇవ్వాల్సిన డబ్బులు మాఫీ చేస్తానని కురుమూర్తితో ఒప్పందం కుదుర్చుకొని పథకం ప్రకారం మార్చి 1న 4 గంటల సమయంలో రాఘవేందర్, కురుమూర్తిలను ఇంటికి పిలిపించి గొర్రెను కోసేది ఉందని చెప్పి ప్రభుత్వ జూనియర్ కళాశాల కేఎల్ఐ కాలువ దగ్గరికి తీసుకెళ్లి అతని తలపై ఉన్న చేతిరుమాలుతో గొంతుకు బిగించారు. అతను అరుపులు చేస్తుండగా కురుమూర్తి చేతులు పట్టుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత రెహ్మాతుల్లా ఊపిరాడక మృతి చెందాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండాలని రెహ్మాతుల్లా శవాన్ని, అతని వెంట తెచ్చుకున్న కత్తిని కేఎల్ఐ కాలువలో పడవేసి రక్తపు మరకలు అంటిన చేతిరుమాలును చీకటి కావడంతో అక్కడే వదిలివేసి వెళ్లారు. రెహ్మాతుల్లా కాల్వలో పడి చనిపోయాడని అనుకునేవిధంగా అతని చెప్పులు, టోపి తీసి కాల్వలో పడవేసి రాఘవేంద్ర, కురుమూర్తి మోటర్ సైకిల్‌పై వెళ్లిపోయారని చెప్పారు. చేతిరుమాలు ఆధారంగా ఈ కేసును ఛేదించడంలో ప్రతిభను చూపిన సీఐ కృష్ణ, ఎస్సై శ్రీనివాసులును, శిక్షణ ఎస్సై హిమబిందు, సిబ్బంది నరేశ్, గోపాల్, దివ్యరెడ్డి, పోలీస్ బృందాన్ని డీఎస్పీ అభినందించారు.

కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

ఎస్ఎల్‌బీసీ వద్ద రెస్క్యూ సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ సంతోష్

ఆపరేషన్ రోబో

- టన్నెల్‌ను పరిశీలించిన నిపుణుల బృందం
- మద్రాస్ ఐఐటీ టీంతో రెస్క్యూ ఆపరేషన్
- బురద ఉండడంతో పసిగట్టని క్యాడవర్ జాగిలం
- వినియోగంలోకి రాని కన్వేయర్ బెల్టు
- ఎస్ఎల్‌బీసీ వద్ద సాగుతున్న సహాయ చర్యలు
- అడవిలో నీటి ధారల కోసం అన్వేషణ
- నేడు సందర్శించనున్న మంత్రి ఉత్తమ్

అచ్చంపేట, మార్చి 7 : ఎస్ఎల్‌బీసీ వద్ద రెస్క్యూ ఆపరేషన్ 15వ రోజుకు చేరింది. నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలోని శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ టన్నెల్‌లో జరిగిన ప్రమాదంలో చిక్కుకున్న మృతదేహాలను వెలికితీసేందుకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. మృతదేహాలను గుర్తించేందుకు కేరళ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన క్యాడవర్ డాగ్స్‌లతో శుక్రవారం ఉదయం 7:30 గంటలకు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతోపాటు తవ్వేందుకు అవసరమైన సామాగ్రితో 110 మంది టన్నెల్‌లోకి వెళ్లారు. మృతదేహాలను గుర్తించేందుకు రెస్క్యూ బృందాలు అనేక విధాలుగా కృషి చేసినా కార్మికుల ఆచూకీ లభించడం లేదు. పోలీసుల వద్ద ప్రత్యేక శిక్షణ పొందిన జాగిలాలు, జీపీఆర్ డేటా ఆధారంగా చర్యలు చేపట్టి తవ్వకాలు జరిపారు. అయినా ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. ఇక బెల్జియం మ్యాల్నోయిస్ బ్రిడ్‌కు చెందిన క్యాడవర్ శునకాలు 15 ఫీట్ల లోపల ఉన్నా మృతదేహాలను గుర్తించడం వీటి ప్రత్యేకత. బురద అధికంగా ఉండడంతో ఇవి కూడా గుర్తించలేకపోయాయి. దీంతో ప్రభుత్వం రోబోలను రంగంలోకి దింపాలని భావించింది. అందులో భాగంగానే ఉదయం 11:25 గంటలకు నలుగురు సభ్యులతో కూడిన అన్వి(ఎఎన్‌వీఐ) రోబోటిక్ నిపుణుల బృందం టన్నెల్‌లోకి వెళ్లింది. లోపల ఇప్పటికి కనిపించకుండాపోయిన కార్మికుల మృతదేహాలను గుర్తించేందుకు వేట కొనసాగిస్తున్నారు. రోబోటిక్ నిపుణులు, ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ మరోసారి టన్నెల్‌లోకి వెళ్లారు. మధ్యాహ్నం బయటకు వచ్చిన క్యాడవర్ డాగ్స్‌లు మూడు ప్రదేశాలను గుర్తించాయి. ఐదు రోజుల కింద జీపీఆర్ డాటా ఆధారంగా గుర్తించిన మూడు ప్రదేశాలనే క్యాడవర్ డాగ్స్ గుర్తించినట్లు స్క్వాడ్ బృందం ప్రతినిధులు తెలిపారు. జీపీఆర్ డాటా ఆధారంగా ప్రదేశాల్లో తవ్వకాలు జరుపుతున్నా అక్కడ నీళ్లు, బురద కారణంగా తవ్వకాలకు ఇబ్బందిగా మారిందని అంటున్నారు. టీబీఎం కిందిభాగంలో కూడా తవ్వకాలు జరపాల్సి ఉన్నందునా ముందుగా మిషన్ పరికరాలు కటింగ్ చేసి పక్కకు తీసిన తర్వాత అక్కడ తవ్వకాలు జరిపే వీలుంటుందని పేర్కొంటున్నారు. క్యాడవర్ డాగ్స్ గుర్తించిన మూడు ప్రదేశాలలో మృతదేహాలు ఖచ్చితంగా ఉండొచ్చని భావిస్తున్నారు.

టన్నెల్‌లోకి క్యాడవర్ డాగ్స్ తీసుకువెళ్తున్న సిబ్బంది

వినియోగంలోకి రాని కన్వేయర్ బెల్ట్

సొరంగంలోని కన్వేయర్ బెల్టు ఇంకా వినియోగంలోకి రాలేదు. రెస్క్యూ బృందాలు బెల్టును మరమ్మతులు చేస్తున్నారు. టీబీఎం పరికరాలు గ్యాస్ కట్టర్ ద్వారా కటింగ్ చేసి లోకో ట్రైన్ ద్వారా బయటకు పంపుతున్నారు. అయితే జియాలజికల్ సర్వే బృందం మూడు రోజులుగా మల్లెలతీర్థం, తాటిగుండాలు, పోసనిగుట్ట అడవీ ప్రాంతంలో తిరిగి సర్వే చేశారు. సొరంగం వెళ్తున్న ప్రదేశాల్లో మరేమైనా నీటి జలాలు, మట్టి లూజుగా ఉండడం, మరేమైన ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయా? అంటూ పరిశీలించారు. శనివారం హెలికాప్టర్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి టన్నెల్‌లో జరుగుతున్న సహాయ చర్యలను పర్యవేక్షించనున్నారు. అనంతరం రెస్క్యూ బృందాల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, డోగ్ర రెజిమెంట్ కమాండెంట్ పరిక్షిత్ మెహ్రా, ఎన్‌డీఆర్ఎఫ్ కమాండెంట్ ప్రసన్న సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

అడవిలో జియోలాజికల్ సర్వే టీం

సొరంగంపై భాగంలో నల్లమల్ల అటవీ ప్రాంతంలో నేషనల్ జియోలాజికల్ సర్వే టీం అటవీ శాఖ అధికారులతో కలిసి ముమ్మరంగా అన్వేషిస్తుంది. ఇక్కడి నుంచి నీటి ధారాలు సొరంగంలోకి వెళుతున్నాయో? ఆ ప్రదేశాన్ని గుర్తించేందుకు జల్లెడ పడుతున్నాయి. పైనుంచి నీటిని మళ్లించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అయినా అక్కడ కూడా ఫలితం కనిపించడం లేదు. మరోవైపు ప్రమాదం జరిగిన చోట సొరంగ మార్గం మరింత ప్రమాదకరంగా మారుతుందని విశ్లేషిస్తున్నారు. గంటగంటకూ ఉబికి వస్తున్న నీటి ఊటతోపాటు బురద కూడా తోడై సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతున్నాయి. ప్రాణాలకు తెగించి సహాయక చర్యల్లో పాల్గొంటున్న వారి ప్రాణాలకు ముప్పుందని భావించిన సర్కారు రోబోల సహాయంతో కార్మికుల ఆచూకీ కనుక్కోవాలని తాజాగా నిర్ణయం తీసుకున్నది.

ముక్కిడిగుండంలో తాగునీటి కోసం వేచి ఉన్న గ్రామస్తులు

తాగునీటికి కటకట

- వారం రోజులు నిలిచిన తాగునీటి సరఫరా
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు

కొల్లాపూర్ రూరల్, మార్చి 7 : కొల్లాపూర్ మండలం ముక్కిడిగుండం గ్రామంలో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు వారం రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో తాగునీటి కోసం సమీప బోరు బావులను ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపురించింది. అయితే పెద్దవాగు బ్రిడ్జిపైన గ్రామానికి సరఫరా అయ్యే మిషన్ భగీరథకు సంబంధించిన పైప్‌లైన్ ఉండగా దాని కనెక్షన్ తొలగించడం వల్ల గ్రామానికి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. తాగునీటి సరఫరా నిలిచిపోయి వారం రోజులు అవుతున్నా ప్రత్యేకాధికారి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం తంటాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ అఫైర్స్ సంయుక్త కార్యదర్శి శివానంద్ బచ్చగుండి

బాలానగర్, మార్చి 7 : ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ అఫైర్స్ సంయుక్త కార్యదర్శి ఎఫ్ శివానంద్ బచ్చగుండి అన్నారు. శుక్రవారం ఆయన బాలానగర్ ఈఎంఆర్ఎస్ (ఏకలవ్య) గురుకులాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గురుకులంలోని తరగతి గదులు, విద్యార్థుల వసతిగృహాలు, భోజనశాల, క్రీడా ప్రాంగణాన్ని సందర్శించారు. కేంద్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ద్వారా నడుస్తున్న బాలానగర్ ఈఎంఆర్ఎస్ గురుకులంలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, భోజనం తదితర అంశాలకు సంబంధించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలను గురించి గురుకులం సుభాష్‌చంద్ర శుక్లాను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్ఈఈటీ, జేఈఈ ఫలితాలపై కూడా ఆరా తీశారు. ఆయన వెంట రాష్ట్ర ఈఎంఆర్ఎస్ సొసైటీ అధికారులు రామారావు, వీర్యానాయక్, ఏకలవ్య గురుకులం ఓఎస్‌డీ లక్ష్మారెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులతో మాట్లాడుతున్న శివానంద్

తోడేస్తున్నారు!

- ఖాళీ అవుతున్న దుందుభీ నది
- అనుమతుల పేరుతో.. ఇసుక అక్రమ రవాణా
- కలెక్టర్, ఎస్పీ ఆదేశాలు బేఖాతర్

దుందుభీ వాగు నుంచి ట్రాక్టర్‌లోకి ఇసుక లోడ్ చేస్తున్న జేసీబీ

ఉప్పనుంతల, మార్చి 7 : అనుమతుల పేరిట దుందుభీ వాగును గుల్ల చేస్తున్నారు. 15 రోజులుగా విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా చేస్తూ వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. గతనెల 11న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, కలెక్టర్ బదావత్ సంతోశ్‌కుమార్ మండలంలోని దుందుభీ పరిసర ప్రాంతాల్లోని ఇసుక రీచ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇక నుంచి ఎట్టి పరిస్థితుల్లో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పర్యవేక్షణకు డీఎస్పీ సత్యనారాయణ సమక్షంలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. అవసరమున్న వారికి ఆన్‌లైన్ ద్వారా గుర్తించిన ఇసుక రీచ్‌ల నుంచి రెవెన్యూ, పోలీస్ అధికారులు కూపన్లు పరిశీలించిన తర్వాత ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు. అయితే అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ మరుసటి రోజు నుంచే మాఫియా అధికార పార్టీ అండదండలతో విచ్చలవిడిగా తరలిస్తున్నది. సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో మునిగిపోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మొల్గర, పెద్దాపూర్, సదగోడు ప్రాంతాల్లోని వాగు నుంచి నిత్యం 500 ట్రాక్టర్ల ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం. పదర, అమ్రాబాద్, అచ్చంపేట, బల్మూర్, ఉప్పునుంతల, లింగాల మండలాల్లో నిర్మిస్తున్న సీసీరోడ్లు, ఆలయాలు, జీపీ భవనాలు, ఇతర ప్రభుత్వ పనులకు అనుమతి పేరిట తరలిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన కొందరు జేసీబీ, హిటాచీతో వ్యాపారాన్ని మూడు పువ్వులు.. ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం 4 జేసీబీలు ఇసుకను తోడేస్తున్నాయి. అధికారులు ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రొసీడింగ్ కాపీ ఆధారంగానే..

అచ్చంపేట నియోజకవర్గంలో ప్రభుత్వ పరంగా జరుగుతున్న సీసీరోడ్లు, జీపీ భవనాలు, ఆలయాల నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు సంబంధిత అధికారుల ప్రొసీడింగ్ కాపీల ఆధారంగా ఇసుక తరలింపునకు అనుమతి ఇస్తున్నా ం. జేసీబీ, హిటాచీలకు అనుమతి లేదు. – ప్రమీల, తాసీల్దార్, ఉప్పనుంతల